క్లుప్తంగా

24న చౌడేశ్వరీ దేవి జయంతి మహోత్సవం



ఓర్వకల్లులో వెలసిన చౌడేశ్వరీ అమ్మవారు

ఓర్వకల్లు: మండల కేంద్రం ఓర్వకల్లు గ్రామంలో వెలసిన శ్రీచౌడేశ్వరీ దేవి మహోత్సవాన్ని ఈ నెల 24వ తేదీన నిర్వహిస్తున్నట్లు ఆలయ భక్తుడు కుర్వ సుంకన్న సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆలయ నిర్వాహకులు, గ్రామ పెద్దల ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమంలో ఉదయం అమ్మవారికి మహాభిషేకం, పుష్పాలంకరణ, పుష్పార్చన, కుంకుమార్చన, మహా నైవేద్యం, మహా నీరాజనం, తీర్థ ప్రసాద వితరణ నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.

భూ సమస్యలపై అర్జీలు



తహసీల్దార్ రమేష్‌బాబుకు వినతి పత్రం అందిస్తున్న రైతు

కర్నూలు(రూరల్): భూ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మండలంలోని పలు గ్రామాల రైతులు సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో రూరల్ తహసీల్దారు టీ.వీ.రమేష్‌బాబుకు వినతిపత్రాలు అందజేశారు. ఉల్చాల, జి.సింగవరం, ఆర్.కొంతలపాడు, దిన్నెదేవరపాడు, నందనపల్లె, పూడూరు, సుంకేసుల తదితర గ్రామాలకు చెందిన రైతులు భూముల సర్వే, మ్యూటేషన్ తదితర వాటిపై అర్జీలు అందజేశారు. ఆయా అర్జీలను పరిశీలించి సకాలంలో పరిష్కరించాలని తహసీల్దార్ వీఆర్వోలకు సూచించారు.

పీ-4 సర్వేపై ఆరా



పాణ్యంలో బంగారు కుటుంబాల అవసరాలు తెలుసుకుంటున్న డిప్యూటీ సీఈఓ

పాణ్యం: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన పీ-4 సర్వేలో నమోదు చేసిన బంగారు కుటుంబాల వివరాలపై డిప్యూటీ సీఈఓ సుబ్బారెడ్డి, ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్ ఆరా తీశారు. పాణ్యం సచివాలయం-3 పరిధిలోని బంగారు కుటుంబాల అవసరాలను తెలుసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ మండలంలో 1,070 బంగారు కుటుంబాలను ఎంపిక చేయడం జరిగిందన్నారు. వీరికి ఎలాంటి అవసరాలు ఉన్నాయో తెలుసుకుంటున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో వెల్ఫేర్ అసిస్టెంట్ రవి, సిబ్బంది పాల్గొన్నారు.

బీమాతో కుటుంబానికి భరోసా



బాధితురాలికి బీమా చెక్కు అందజేస్తున్న పీడీ ఆంజనేయులు

ఓర్వకల్లు: బీమా చేయించుకుంటే కుటుంబానికి భరోసా ఇస్తుందని కెనరా బ్యాంక్ మేనేజర్ శివశంకర్‌రెడ్డి అన్నారు. మండలంలోని కన్నమడకల గ్రామానికి చెందిన కె.లక్ష్మీదేవి అను మహిళకు పీఎంజేజేబీవై కింద మంజూరైన బీమా సొమ్మును సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా మేనేజర్ మాట్లాడుతూ గ్రామానికి చెందిన కె.మహేష్ అను వ్యక్తి గతేడాది అనారోగ్యంతో మరణించారన్నారు. మృతుడి పీఎంఎస్‌బీవై కింద ఏడాదికి రూ.20, పీఎంజేజేబీవై కింద రూ.436 చొప్పున ప్రీమియం చెల్లించడంతో నామినీకి రూ.2 లక్షలు మంజూరైనట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో బ్యాంకు అధికారులకు, ఆర్థిక అక్షరాస్యత కేంద్రం అధికారులకు బాధిత కుటుంబసభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో ఆర్థిక అక్షరాస్యత ప్రాజెక్టు డైరెక్టర్ ఆంజనేయులు, ప్రాజెక్టు మేనేజర్ అశోక్‌కుమార్, కెనరా బ్యాంక్ సిబ్బంది శేషు,బీసీ సూరన్న,రమేష్ పాల్గొన్నారు.

రోడ్డును నిర్మించాలి

కర్నూలు(సెంట్రల్): కర్నూలు శివారులోని జొహరాపురం నుంచి వెంకాయపల్లె వరకు దెబ్బతిన్న రోడ్డును బాగు చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి, వర్గ సభ్యురాలు పి.నిర్మల డిమాండ్ చేశారు. రహదారిలో ఎక్కడ చూసినా గుంతలు ఉండటంతో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. సోమవారం సీపీఎం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వెంటనే రహదారిని విస్తరించి ఇరువైపులా కాల్వల నిర్మాణాలను చేపట్టాలన్నారు. దీనిపై పలుమార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ రహదారిని బాగుచేస్తే గుంటూరు-కర్నూలు రహదారిపై కూడా ట్రాఫిక్ తగ్గే అవకాశం ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శించారు. కూటమి ప్రభుత్వం రహదారులను బాగు చేస్తున్నామని చెబుతున్నా ఆచరణలో ఎక్కడా కనిపించడం లేదని మండిపడ్డారు. నగర కార్యదర్శి ఎం.రాజశేఖర్, విజయ్ రామాంజనేయులు పాల్గొన్నారు.

చంద్రబాబు మోసాలను ప్రజలకు వివరిద్దాం

- వైఎస్సార్‌సీపీ కోడుమూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ ఆదిమూలపు సతీష్
- సి.బెళగల్‌లో 'బాబు షూరిటీ – మోసం గ్యారెంటీ' కార్యక్రమం
- భారీగా హాజరైన పార్టీ మండల నాయకులు, కార్యకర్తలు



'బాబు షూరిటీ - మోసం గ్యారెంటీ' క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరిస్తున్న డాక్టర్ ఆదిమూలపు సతీష్, పార్టీ నాయకులు

సి.బెళగల్: అలవిగాని హామీలిచ్చి ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్ర ప్రజలకు చేసిన మోసాలను ఇంటింటికీ వెళ్లి వివరిద్దామని వైఎస్సార్‌సీపీ కోడుమూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ ఆదిమూలపు సతీష్ అన్నారు. పార్టీ నాయకుడు సీబీ గోవిందరెడ్డి ఇంటి ఆవరణలో సోమవారం మండల కన్వీనర్ సోమశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో 'బాబు షూరిటీ – మోసం గ్యారెంటీ' కార్యక్రమం జరిగింది. మండల వ్యాప్తంగా ఉన్న వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు, పార్టీ అభిమానులు పెద్ద ఎత్తున హాజరవగా, ముఖ్య అతిథిగా డాక్టర్ ఆదిమూలపు సతీష్ హాజరై కూటమి ప్రభుత్వ మోసపూరిత పాలనను ఎండగట్టారు. కూటమి నాయకులు రాష్ట్ర ప్రజలకు చేసిన వాగ్దానాలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలమయ్యారన్నారు. చంద్రబాబు మోసాలను ప్రశ్నిస్తే అక్రమ కేసులు, దాడులు, చేయిస్తూ, డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని విమర్శించారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో గత ప్రభుత్వం పేద ప్రజల అభివృద్ధికి రూ.2 లక్షల కోట్లతో సంక్షేమ పథకాలను చేపట్టిందని, చంద్రబాబు అండ్ కో గద్దెనెక్కి 14 నెలల కావొస్తున్నా ఒక్క సంక్షేమ పథకం కూడా పూర్తి స్థాయిలో అమలు చేయలేదని మండిపడ్డారు. నియోజకవర్గ నాయకుడు, కుడా మాజీ చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి అధ్యక్షతన పార్టీ శ్రేణులకు అన్ని విధాలుగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. కూటమి ప్రభుత్వ మోసాలను, అవినీతి, అక్రమాలు, ప్రజా వ్యతిరేక కార్యకలాపాలను ఇంటింటికీ వెళ్లి వివరించాలని పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు.

వైఎస్సార్‌సీపీ పోరాటంతోనే పథకాలు

వైఎస్సార్‌సీపీ మండల మైనార్టీ నాయకుడు ఎస్‌ఎం బాషా మాట్లాడుతూ.. ప్రజల పక్షాన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ శ్రేణుల పోరాటాలు, ధర్నాలతోనే కూటమి ప్రభుత్వం 'తల్లికి వందనం' పథకాన్ని అరకొరగా అమలు చేసిందని గుర్తు చేశారు. ఇకపై కూడా పార్టీ నాయకులు ఒక్కటై ప్రజల పక్షాన ప్రభుత్వంపై పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. చంద్రబాబు పేరు చెబితే గుర్తుకొచ్చే పథకం ఒక్కటి కూడా లేదని, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పాలనలో తనదైన ముద్రవేస్తూ పేదల అభివృద్ధికి సంక్షేమ పథకాలను అమలు చేయడంతో పాటు, రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపారని గుర్తు చేశారు.

బాబు గతమంతా మోసమే

సింగల్ విండో మాజీ చైర్మన్ సీబీ గోవిందరెడ్డి మాట్లాడుతూ.. పిల్లనిచ్చిన మామను వెన్నుపోటు పొడిచి అధికారం చేజిక్కించుకున్న చంద్రబాబు, తర్వాత రాష్ట్ర ప్రజలను మోసగిస్తూనే ఉన్నారని విమర్శించారు. దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి రాష్ట్ర రైతాంగం కోసం రుణమాఫీ, వ్యవసాయానికి ఉచిత విద్యుత్‌ను ప్రకటిస్తే హేళనగా మాట్లాడారని, కానీ అధికారం కోసం 2014 ఎన్నికల్లో రైతులకు రుణమాఫీ ప్రకటించి మాట తప్పారని గుర్తు చేశారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ రైతు భరోసా, పంట నష్టం, ఉచిత పంటల బీమా, ఆర్బీకేల ద్వారా గ్రామాలకే ఎరువుల సరఫరా వంటి గొప్ప కార్యక్రమాలు చేపడితే ఇప్పుడు చంద్రబాబు కుట్రలలో ఎరువుల కోసం రైతులు అవస్థలు పడుతున్నారని, పంట బీమా ప్రీమియంను సైతం రైతులే చెల్లించాలనడం.. రైతుల పట్ల ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధిని తెలియజేస్తోందని విమర్శించారు. మండల కన్వీనర్ సోమశేఖర్‌రెడ్డి, సి.బెళగల్ సర్పంచ్ పాండురంగన్న, గుండ్రేవుల నాయకుడు శ్రీనివాసులు తదితరులు కూటమి ప్రభుత్వ మోసాలపై మాట్లాడారు. అనంతరం పార్టీ నాయకులతో కలిసి డాక్టర్ సతీష్ 'బాబు షూరిటీ – మోసం గ్యారెంటీ' క్యూఆర్ కోడ్ పోస్టర్లను ఆవిష్కరించారు. నాయకులు సీబీ తులసిరెడ్డి, పులిరాజు, తిరుమలేష్, నరసింహుడు, హారున్, మల్లికార్జున, మహానంది, లచ్చప్ప, రాఘవేంద్ర, మద్దిలేటి, వెంకటేష్, గోపాల్, రామకృష్ణ, శంకర్‌రెడ్డి, నాగేశ్వరరెడ్డి, భానుప్రకాష్‌రెడ్డి, కరుణాకర్ రెడ్డి, శేశిరెడ్డి, శోభన్, రామాంజనేయులు, నాగప్ప, తెలుగు దస్తగిరి, ఇనగండ్ల, బ్రాహ్మణదొడ్డి సర్పంచ్‌లు ఇమ్మాన్యుయేల్, దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.

నేడు గడివేములలో 'బాబు ష్యూరిటీ - మోసం గ్యారెంటీ'

గడివేముల: మండల కేంద్రమైన గడివేములలో మంగళవారం ఉదయం బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మధుసూదన సోమవారం తెలిపారు. ఈ కార్యక్రమానికి నంద్యాల జిల్లా వైఎస్సార్‌సీపీ ఆధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి హాజరవుతున్నట్లు చెప్పారు. మండలంలోని ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

పేద కుటుంబానికి ఆర్థిక సాయం



ఆర్థిక సాయం, సరుకులు అందిస్తున్న యువకులు

పాణ్యం: మండల కేంద్రం పాణ్యం చెంచుకాలనీకి చెందిన మేకల నాగశుషలు కుటుంబానికి పలువురు దాతలు అండగా నిలిచారు. ఇటీవలే నాగేషులు మృతి చెందడం..అదే సమయంలో ఆయన భార్య ఆరోగ్యం క్షీణించడం వల్ల కుటుంబపోషణ భారంగా మారింది. వీరి నలుగురు పిల్లలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న పాణ్యం ముస్లిం మైనార్టీ గ్రూప్ సభ్యులు రూ. 10వేల నగదు, కుటుంబానికి నిత్యావసర సరుకుల కిట్ అందించారు. అలాగే మరి కొంత మంది దాతలు కుటుంబానికి అండగా ఉంటామని, భవిష్యత్తులో పిల్లలకు ఆర్థిక సహాయ సహకారాలు అందిస్తామని చెప్పారు.

బిల్లు కడతావా..? కనెక్షన్ తొలగించాలా?

- అధిక బిల్లు సమస్య పరిష్కరించకుండా బెదిరింపులు
- ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో బాధితుడి ఫిర్యాదు



పీజీఆర్‌ఎస్‌లో అధికారులకు అర్జీ ఇస్తున్న నాగేంద్ర ఆచారి



కార్పెంటర్ షాపునకు రూ.25565 బిల్లు

కోడుమూరు రూరల్: కరెంట్ బిల్లు కడతావా? లేదంటే నీ కార్పెంటర్ షాపుకు ఉన్న కరెంట్ కనెక్షన్‌ను తొలగించాలా? అంటూ వేళ గాని వేళలో ఫోన్ చేసి విద్యుత్ సిబ్బంది బెదిరింపులకు పాల్పడుతున్నారంటూ కోడుమూరుకు చెందిన కార్పెంటర్ నాగేంద్ర ఆచారి సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన పీజీఆర్‌ఎస్‌లో అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా బాధితుడు మాట్లాడుతూ..కార్పెంటర్ పనిచేస్తూ జీవనం సాగిస్తున్న తన షాపుకు మే 14న అధికారులు స్మార్ట్ మీటర్‌ను ఏర్పాటు చేశారని, తర్వాత 15 రోజులకే జూన్‌లో కరెంటు బిల్లు రూ.18,570 బిల్లు, జూలైలో రూ.7,995 వచ్చిందని వాపోయారు. గతంలో ఏనాడూ తన షాపు కరెంటు బిల్లు రూ.800కు మించి రాలేదని, దీనిపై కోడుమూరు విద్యుత్ అధికారుల దృష్టికి తీసుకెళ్లానన్నారు. ఈ నేపథ్యంలో జూన్ నెల మినిమం బిల్లు రూ.వెయ్యి చెల్లించానని, అయితే ఈ నెల కూడా సమస్య పరిష్కారం కాకపోవడంతో మినిమం బిల్లు చెల్లించేందుకు వెళ్లగా సిబ్బంది కట్టించుకోవడం లేదని వాపోయారు. గత రెండు రోజుల నుంచి బిల్లు కడతా వా? లేదంటే కనెక్షన్ తొలగించాలా? అంటూ లైన్‌మెన్ రాత్రి వేళ సైతం ఫోన్ చేసి బెదిరింపులకు పాల్పడుతున్నాడని, తాను మీటర్ చెకప్ కోసం అర్జీ పెట్టానని, ఇంకా దాని వివరాలు రాలేదని, అంతవరకు వేచిఉండాలని చెప్పినా లైన్‌మెన్ వినకుండా వేధిస్తున్నారని వాపోయారు. విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు స్పందించి తన సమస్యను పరిష్కరించాలని నాగేంద్ర ఆచారి మొరపెట్టుకున్నారు.

వర్షం కోసం రుద్రాభిషేక పూజలు



సి.బెళగల్: వరుణుడి కరుణ కోసం రైతులు శివుడికి అభిషేక పూజలు నిర్వహించారు. సోమవారం స్థానిక కోటవీధిలోని రాజరాజేశ్వరి ఆలయంలో కొలువైన శివుడికి పండితులు మధ్వాచారులు, సుదర్శమాచార్యులు ఆధ్వర్యంలో భక్తులు ప్రత్యేక పూజా కార్యక్రమాలను చేపట్టారు. కార్యక్రమంలో భాగంగా చక్రం బావి నుంచి నీటిని తీసుకొచ్చి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం నిర్వహించారు. వర్షాలు సమృద్ధిగా కురవాలని, ఏకాదశి రోజున శివుడికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు పండితులు తెలిపారు.

పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనపై అవగాహన



మాట్లాడుతున్న ఎంపీడీఓ శ్రీనివాసులు

ఓర్వకల్లు: మండలంలోని వివిధ గ్రామాల్లో గల ఆదర్శ ప్రాథమిక పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనపై హెచ్ఎంలకు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంఈఓ-2 ఓంకార్ యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాసులు మాట్లాడుతూ ఆదర్శ ప్రాథమిక పాఠశాలల్లో తరగతి గదులు, మైనర్ రిపేర్లు, గ్రీన్ చాక్ బోర్డులు, పెయింటింగ్ తదితర వాటిలో ఏవైనా అవసరం ఉంటే హెచ్ఎంలు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు సంయుక్తంగా పరిశీలించి ఎంఈఓకు నివేదిక ఇవ్వాలన్నారు. ఎంఈఓ పరిశీలించి పనుల మంజూరుకు అప్రూవల్ చేస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ-1 శ్రీధర్‌బాబు, ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజనీర్ శ్రీనివాసులు, సీఆర్‌పీలు పాల్గొన్నారు.



వీకర్‌సెక్షన్ కాలనీలో నిలిచిన వర్షపునీరు

వానొస్తే ఇంతే !

కల్లూరు: కల్లూరు అర్బన్ పరిధిలో 16 వార్డులున్నాయి. వీటిలో సుమారు 2.5 లక్షల మంది నివసిస్తున్నారు. అయితే, పలు వార్డుల్లో సరైన సదుపాయాలు లేవు. కొన్ని చోట్ల నేటికి మట్టి రోడ్డే దర్శనమిస్తున్నాయి. చిన్నపాటి వర్షం కురిస్తే చాలు అవి బురదమయంగా మారుతున్నాయి. పేదలు నివసించే వీకర్‌సెక్షన్ కాలనీలో పరిస్థితి మరీ దారుణంగా ఉంది. ఇక్కడ ప్రధాన రోడ్డులో రెండు ట్యాంకుల దగ్గర వర్షం నిలిచిపోయి రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా మారింది. పరిమళనగర్, వీకర్‌సెక్షన్ కాలనీ, మహాలక్ష్మీనగర్, ఎఫ్‌సీఐ కాలనీ, నాగేంద్రనగర్ తదితర ఏరియాల్లో అడుగులోతు గుంతలతో రోడ్లు దర్శనమిస్తున్నాయి. కూటమి సర్కారు ఎన్నికల ముందు అధికారంలోకి రాగానే రోడ్లను బాగు చేస్తామని ప్రకటించి ఇప్పుడు ఆ దిశగా ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని ఆయా కాలనీల ప్రజలు మండిపడుతున్నారు.



పరిమళనగర్‌లో గుంతమయంగా ఉన్న రోడ్డులో నిలిచిన వర్షపునీరు

విద్యుత్ పరికరాలతో జాగ్రత్త

కర్నూలు (రూరల్): రానున్న మూడు రోజుల్లో భారీ వర్షాలు కురిసే అవకాశమున్నందున కర్నూలు మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని విద్యుత్ ఏఈ మహమ్మద్ ఇస్మాయిల్ సూచించారు. ఆయన సోమవారం మాట్లాడుతూ వర్షాలు కురిసేటప్పుడు స్టే వైర్, విద్యుత్ లైన్ల కింద, ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద నిలబడరాదన్నారు. విద్యుత్ పరికరాలకు దూరంగా ఉండాలని, పశువులు, పెంపుడు జంతువులను కూడా విద్యుత్ పరికరాలకు దూరంగా ఉంచాలన్నారు. గ్రామాల్లో రోడ్ల మీద, నీటిలో గానీ, పొలాల్లో గానీ విద్యుత్ తీగలు తెగిపడితే వాటిని తొక్కడంగానీ, వాటి మీద నుంచి వాహనాలు నడపటం వంటివి చేయరాదన్నారు. ఎక్కడైనా విద్యుత్ తీగలు తెగి పడి ఉంటే విద్యుత్ సిబ్బందికి లేదా కర్నూలు మండల విద్యుత్ ఏఈ (ఫోన్ నంబర్ 9440813367)కు సమాచారం ఇవ్వాలన్నారు. ఎవరైనా విద్యుత్ షాక్ బారిన పడినప్పుడు వారిని రక్షించేందుకు విద్యుత్ ప్రవాహకాలైన లోహపు రాడ్లను ఉపయోగించకుండా చెక్క లేదా ప్లాస్టిక్‌తో చేసిన పైపులను మాత్రమే ఉపయోగించాలని సూచించారు.

పంటల రక్షణపై శిక్షణ



రైతుల శిక్షణలో మాట్లాడుతున్న వ్యవసాయ అధికారులు

కల్లూరు: పంటల సమగ్ర సస్య రక్షణపై ఓబుళాపు రం తండాలో ఎస్టీ రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. జిల్లా వనరుల కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కర్నూలు సహాయ వ్యవసాయ సంచాలకులు సాలురెడ్డి, డీఆర్‌సీ ఏడీఏ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పంటలపై శిక్షణను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. తర్వాత ఎరువుల యాజమాన్యం గురించి వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు విష్ణువర్ధన్‌రెడ్డి, శశిధర్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

టీబీ పరీక్షలు చేయించుకోవాలి

కల్లూరు: ముందు జాగ్రత్తగా అందరూ టీబీ పరీక్షలు చేయించుకోవాలని మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మోతీలాల్ నాయక్ అన్నారు. సోమవారం పుసులూరు గ్రామంలో టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా టీబీ పరీక్షలు చేసి ఆరోగ్యం విషయాలను తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

పీజీఆర్‌ఎస్‌కు ఎనిమిది అర్జీలు



సి.బెళగల్‌లో పీజీఆర్‌ఎస్ నిర్వహిస్తున్న తహసీల్దార్ వెంకటలక్ష్మి

సి.బెళగల్: ప్రజా సమస్యల పరిష్కార వేదికకు (పీజీఆర్‌ఎస్‌కు) మండల ప్రజల నుంచి ఎనిమిది అర్జీలు వచ్చినట్లు తహసీల్దార్ వెంకటలక్ష్మి తెలిపారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆమె మండల అధికారులు, వీఆర్వోలతో కలిసి పీజీఆర్‌ఎస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని పలు గ్రామాలకు చెందిన పలువురు రైతులు తమ భూములను రికార్డుల కొలతల ప్రకారం ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని అర్జీలు ఇచ్చారు. అనంతరం తహసీల్దార్ మాట్లాడుతూ.. అర్జీలను సమగ్రంగా విచారించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు. మండల వ్యవసాయ అధికారి (ఏఓ) మల్లేష్‌కుమార్, ఆర్ఐ తరుణ్, మండల సర్వేయర్ నాగభూషణం ఉన్నారు. అదేవిధంగా స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన పీజీఆర్‌ఎస్‌లో ఆర్‌డబ్ల్యూఎస్, హౌసింగ్ ఏఈలు గోనేనాయక్, సుమంత్, మండల పరిషత్ పరపాలన అధికారి శ్రీనివాసులు, ఏపీఓ రామన్న మాత్రమే హాజరవగా, కొందరు అధికారులు సమయపాలన పాటించకుండా ఆలస్యంగా పీజీఆర్‌ఎస్‌కు హాజరయ్యారు.

పాలనలో కూటమి విఫలం



కూటమి ప్రభుత్వ మోసాలను వివరిస్తున్న వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్ రెడ్డి

- హామీల అమలు ఏదీ?
- వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కల్లూరు: కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడాది దాటినా ఒక్క హామీ కూడా అమలు చేయలేకపోయారని, అరకొరగా అమలుచేసిన 'తల్లికి వందనం' పథకం అందరికీ వర్తించలేదని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. సోమవారం కల్లూరు అర్బన్ 33వ వార్డులో బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ, ఇంటింటికీ వంచన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కాటసాని రాంభూపాల్‌రెడ్డి వార్డులో పర్యటించగా ప్రజలు వివిధ సమస్యలను ఆయన దృష్టికి తెచ్చారు. పాఠశాలలో పిల్లలకు ఇచ్చిన బ్యాగులు రెండు రోజుల్లోనే చిరిగి పోయాయని తెచ్చి చూపించారు. స్థానిక ఎమ్మెల్యే ఇంతవరకు కాలనీలోకి రాలేదని స్థానికులు కాటసానికి వివరించారు. ఈ సందర్భంగా కాటసాని రాంభూపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. బాబు ష్యూరిటీ అని ప్రచారం చేసుకున్నారు తప్పా ప్రజలకు ఎక్కడా ష్యూరిటీ లేదని విమర్శించారు. కూటమికి అధికారం కట్టబెట్టి మోసపోయామని ప్రజలకు అర్థమైందన్నారు. నిరంతరం ప్రజల తరపున వైఎస్సార్‌సీపీ పోరాటం చేస్తుందన్నారు. ప్రజలకు ఎలాంటి పథకాలు అందించకపోయినా 'ఇది మంచి ప్రభుత్వం' అని ప్రచారం చేసుకుంటున్నారని విమర్శించారు. మాజీ ముఖ్యమంతి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన పథకాలతో పాటు సూపర్ సిక్స్ పథకాలు ఇస్తామని ఎన్నికల్లో హామీలు ఇచ్చారన్నారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడాది గడిచాక వైఎస్సార్‌సీపీ పోరాటం చేయగా 'తల్లికి వందనం' పథకం మాత్రం అమలు చేశారని, అది కూడా అందరికీ ఇవ్వలేదని విమర్శించారు. దీపం పథకం సక్రమంగా అమలు కావడం లేదన్నారు. ఉచిత బస్సు ప్రయాణం పథకంపై కల్లబొల్లి మాటలు చెబుతున్నారని, ఎప్పుడు అమలు చేస్తారని ప్రశ్నించారు. అలాగే నిరుద్యోగ భృతి, అన్నదాత సుఖీభవ, ఆడబిడ్డ నిధి, 50 ఏళ్లకే పింఛన్ తదితర హామీలను వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు.

నిత్యావసర సరుకుల ధరలు పెరిగాయి

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నిత్యావసర సరుకుల ధరలు విపరీతంగా పెరిగిపోయాయని కాలనీవాసులు మాజీ ఎమ్మెల్యే కాటసాని వద్ద గోడు వెల్లబోసుకున్నారు. ఎన్నికల్లో గెలిపిస్తే నిత్యవసర సరుకుల ధరలు తగ్గిస్తామని, స్మార్ట్ మీటర్లు బిగించమని ప్రగాల్భాలు పలికారని, అధికారంలోకి వచ్చాక ప్రజలను మోసం చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. కార్పొరేటర్లు నరసింహులు, శ్రీనివాసులు, సుదర్శన్‌రెడ్డి, నారాయణరెడ్డి, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సమ్మెకాల ఒప్పంద జీఓలను విడుదల చేయాలి



గూడూరులో సమ్మె చేస్తున్న మున్సిపల్ కార్మికులు

కోడుమూరు రూరల్: మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులకు సంబంధించి సమ్మెకాల ఒప్పంద జీఓలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని సీఐటీయూ డివిజన్ కార్యదర్శి మోహన్ డిమాండ్ చేశారు. పెన్షన్, ఉద్యోగాలను పర్మినెంట్ చేసి సమ్మెకాల ఒప్పంద జీఓలను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం గూడూరు మున్సిపల్ కార్మికులు సీఐటీయూ ఆధ్వర్యంలో సమ్మె నిర్వహించారు. ఈ సందర్భంగా మోహన్ మాట్లాడుతూ.. ఎన్నో ఏళ్లుగా పనిచేస్తున్నా కనీస వేతనం, గ్రాట్యుటీ, పెన్షన్ వంటి సౌకర్యాలు లేక మున్సిపల్ కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. గత సమ్మె కాలంలో ప్రభుత్వం కార్మికులతో ఒప్పందాలు చేసుకుని ఇప్పటివరకు ఒప్పంద జీఓలను విడుదల చేయకుండా కాలయాపన చేస్తోందని విమర్శించారు. ఇకనైనా ప్రభుత్వం స్పందించి ఒప్పంద జీఓలను వెంటనే విడుదల చేయాలని, పారిశుద్ధ్య కార్మికులను ప్రైవేటుకు అప్పజెప్పే నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని, కార్మికుల రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్మికులు గోపాల్, గుంతన్న, గ్రేసమ్మ, శేఖర్, వెంకటేశ్వరమ్మ, లక్ష్మిదేవి, సూర్య, దాసు, రాజు తదితరులు పాల్గొన్నారు.

రెండు రోజులు నీటి సరఫరా బంద్

కర్నూలు (టౌన్): నగరంలో రెండు రోజుల పాటు నీటి సరఫరాకు అంతరాయం కలుగుతుందని నగర పాలక కమిషనర్ పి.విశ్వనాథ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక మునగాలపాడు సమ్మర్ స్టోరేజీ ట్యాంకు నుంచి అశోక్ నగర్ ఫిల్టర్ బెడ్‌కు నీటిని సరఫరా చేస్తున్న 1200 ఎంఎం డయా పైపులైన్ లీక్ అయ్యినట్లు పేర్కొన్నారు. దీని వల్ల ఈనెల 23, 24 తేదీల్లో మంచినీటి సరఫరాకు అంతరాయం ఉంటుందని తెలిపారు. నగర ప్రజలు నీటిని పొదుపుగా వాడుకొని నగరపాలక సిబ్బందికి సహకరించాలని కోరారు.

ప్రమాదకరంగా విద్యుత్ స్తంభాలు





పూడిచెర్ల రోడ్డులో వాలిన విద్యుత్ స్తంభాలు, పొలంలో వాలిన విద్యుత్ స్తంభాలు

కర్నూలు(రూరల్): మండల పరిధిలోని గార్గేయపురం – పూడిచెర్ల హంద్రీ నీవా కాలువ బ్రిడ్జి సమీపాన పొలాల్లో ఉన్న విద్యుత్ స్తంభాలు ఓ వైపు ఒరిగిపోయి ప్రమాదకరంగా ఉన్నాయని ఆ ప్రాంత రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురుస్తున్నాయని, ఒరిగిన విద్యుత్ స్తంభాల కారణంగా ఎప్పుడు ఎలాంటి ప్రమాదం ముంచుకొస్తుందోనని వాపోయారు. ప్రధాన రోడ్డులో ఎక్కువ మంది రాకపోకలు సాగిస్తుంటారని, ఇప్పటికైనా విద్యుత్ శాఖ అధికారులు నిర్లక్ష్యం వీడి ఏదైనా ప్రమాదం జరగకముందే విద్యుత్ స్తంభాలను సరి చేయాలని కోరుతున్నారు.